

సిసిఎల్ మంజూరుకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: తరల్ శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి సుందర్రావుకు వినతి పత్రాన్ని శనివారం అందజేశారు జిల్లా కార్యదర్శి కమిటీ సభ్యుడు, మండల అధ్యక్షుడు కన్నయ్య, రఘునాథ్, బాలక్రిష్ణ మాట్లాడుతూ, రెండో శనివారం సెలవు కావడంతో సీసీఎల్ మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొవడం జరిగిందన్నారు. స్పందించిన ఎంఈవో శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేస్తున్నామని ప్రకటిండంతో ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం నాయకులు రాజారావు, దుక్కు, సుబ్బారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కోసం

13న ఐటిడిఎల ముట్టడి

ప్రజాశక్తి-పాడేరు : ఐదవ షెడ్యూల్ పరిధిలో ఆదివాసి యువతకు నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 13న సోమవారం పాడేరు ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగేని ధర్మన్నపడాల్ తెలిపారు. స్థానిక ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం ఆదివాసి నిరుద్యోగుల సంఘం ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ సత్యనారాయణ ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మపుడాల్, కో కన్వీనర్ భాను, సిహెచ్ రావు ఈ కార్యక్రమం నిర్వహణపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివాసి ప్రాంతంలో 100శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తామని ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో హామీ ఇచ్చి అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఆదివాసి నిరుద్యోగులు ఈ మెగా డీఎస్సీలో 4000 మందికి రావలసిన ఉద్యోగాలు నాన్ ట్రైబల్ కు కట్టబెట్టడం జరిగిందన్నారు. దీని ఫలితంగా ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయి తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. ఆదివాసి ప్రాంతంలో ఐటీడీఏల పరిధిలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పర్యవేక్షణలో స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి ఆదివాసి ప్రాంతంలో ఆదివాసి అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు.ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో ఈ నెల 13వ తేదీన ఐటీడీఏ ముట్టడి నిర్వహిస్తున్నామన్నారు. ఐటీడీఏ పరిధిలో 11 మండలాల నుంచి యువత నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు డిపి శంకర్, రాము, వినయ్, సురేష్ మౌనిక, స్వాతి మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో మాట్లాడుతున్న నాయకులు

విఆర్‌పురం: ఈ నెల 13న చింతూరు ఐటిడిఎ ముట్టడి కార్యక్రమానికి అంతా తరలి రావాలని, విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. విఆర్‌పురం మండలం చొక్కనపల్లిలో బీరబోయిన గౌతమ్‌కుమార్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. జిఒనెంబర్3 రద్దుతో ఏజెన్సీ ప్రాంతంలో శతశాతం ఉద్యోగ రిజర్వేషన్ ఆదివాసీ ప్రజానీకం కోల్పోయారన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డిఎస్‌సి లో ఏజెన్సీకి కేవలం ఆరుశాతం ఉద్యోగ అవకాశాలు మాత్రమే కల్పించారని ఇది చాలా దారుణం అన్నారు. సమావేశానికి గ్రామపటేల్ తోడంరాజు, పీసా కార్యదర్శి తోడంఅనిల్, గొంది దారయ్య, సిపిఎం మండల నాయకులు పోడియం శ్రీరామమూర్తి , ఆదివాసీ నిరుద్యోగ సంఘం మండల నాయకులు విశ్వంత్‌కుమార్ , పాయం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: గిరిజన హక్కులు చట్టాలు పటిష్ట అమలకై ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగ అవకాశాలు గిరిజనులకు కల్పనకై ఈనెల 13న ఛలో రంప చోడవరం ఐటిడిఎ జయప్రదం చెయ్యాలని దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ వంతు బాలకృష్ణ శనివారం పిలుపునిచ్చారు. మండలం లోని అమీనాబాద్,తదితర గ్రామాల్లో ఆదివాసీ జేఏసీ, ఇతర ఆదివాసీ సంఘాలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఐదోషెడ్యూల్ ప్రాంతంలో నూరుశాతం ఉద్యోగాల నియామక చట్టం చేయమని లేనిపక్షంలో ప్రభుత్వం ఆదివాసీలు విశ్వరూపం చూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో గిరిజన హక్కులు ఉద్యోగాలు సాధన కమిటీ నాయకులు లోవప్రసాద్, శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.



విఆర్.పురంలో మాట్లాడుతున్న నాయకులు

ముందుగానే పండిన కాఫీ

ప్రజాశక్తి- అనంతగిరి:అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అరకు కాఫీ ఈ ఏడాది ముందుగానే పండింది. దీంతో రైతులు ఆనంద వ్యక్తం చెందుతున్నారు. ముందుగానే వర్షాలు కురవడంతో కాఫీ పూత. ఏప్రిల్, మే నెలలోనే విరబూసింది. అక్టోబర్ నెలలోనే కాఫీ పంట పండడం మొదలైంది. ఈ పంట నవంబర్ డిసెంబర్ నెలలో పండవలసి ఉన్నప్పటికీ ఆ నెలలో పళ్ళ సేకరణకు రైతులు నిమగ్నమై రెండు నుండి మూడు నెలల వరకు సేకరణలో బిజీలో పడతారు. ఈ పంట అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, పాడేరు, చింతపల్లి, కొయ్యురు, జీకెవిది తదితర మండలాలలో రైతులు విస్తరంగా సాగు చేసుకుంటారు.



పిఎం ధన్ ధాన్య కృషి యోజన పథకానికి...

అల్లూరి జిల్లా ఎంపిక

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వెల్లడించారు. అన్నదాతల, సుసంపన్న భారత్ నిర్మాణంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా రూ. 42 వేల కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ప్రాజెక్టులను శనివారం వర్చువల్‌గా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు . పీఎం ధన్ ధాన్య కృషి యోజన', 'పప్పు ధాన్య ఆత్మ నిర్భరత పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లాలో కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి కలెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వంద జిల్లాలలో అమలు చేయనున్న 'ధన్ ధాన్య కృషి యోజన' పథకానికి అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎంపిక కావడం చాలా అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. ఆరేళ్ల పాటు అమల్లో ఉండే ఈ పథకం ద్వారా జిల్లాలో వ్యవసాయ ఉత్పాదకత పెంపులో భాగంగా కీలక మార్పులు రానున్నాయని తెలిపారు.ఈ పథకం ముఖ్యంగా పంటల మళ్లింపు, మార్పిడి విధానాలతో లాభసాటి సాగుకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. నీటి పారుదల సౌకర్యాల మెరుగుదల, స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ఆచరణపై దృష్టి సారిస్తుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన సన్న, చిన్నకారు రైతుల్ని ఆదరించడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలనేది ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా సంవత్సరం అంతా దిగుబడులు సాధించవచ్చున్నారు. జిల్లాల వ్యవసాయ అభివృద్ధికి రైతులందరూ సంఘాలుగా ఏర్పడి సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక చైర్మన్ వంపూరు గంగులయ్య, బిజెపి గిరిజన మోర్చా నాయకులు పాంగి రాజారావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్ పాల్గొన్నారు.

నెల రోజుల్లో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

- విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల వెల్లడి
- కాలినడకన గూడెం గ్రామానికి...
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- అనంతగిరి:గూడెం గిరిజనుల గోడు విన్నెదెన్నడో అనే వార్త కథనం సెప్టెంబర్ నెల 22వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురణమైన విషయం పాఠకులకు తెలిసిందే. స్పందించి కదిలిన జిల్లా విద్యుత్ శాఖ ఉన్నత అధికార యంత్రాంగం శనివారం రొంపల్లి పంచాయతీ పరిధి కొండశిఖరు గూడెం గ్రామంలో కాలినడకన నాలుగు కిలోమీటర్ల దూరం ఎత్తయిన కొండ కోనలు దట్టమైన అటవీ ప్రాంతంలో మీదుగా సందర్శించారు. అనంతరం గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని గిరిజనులు విన్నవించగా విద్యుత్ శాఖ జిల్లా ఎస్సీ జివిఎన్. ప్రసాద్, డిఇ వేణుగోపాల్ . మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సమస్య పరిష్కరించామని, గూడెం గ్రామానికి వారం రోజులు లోపే పనులు ప్రారంభించి నెల రోజుల్లోనే పనులు ముగిస్తామని చెప్పారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న అధికారులకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె .గోవింద్, వార్డు సభ్యులు ఎస్. అప్పలరాజు, గ్రామస్తులు సింహాద్రి, ఆనంద్. అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ కె.ఆనందమురళి, సిబ్బంది పాల్గొన్నారు.



కాలినడకన గ్రామానికి వెళుతున్న అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

హైడ్రో పవర్ ప్రాజెక్టు పనుల అడ్డగింత

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరులో 1350 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయదలిచిన హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులను గిరిజనులు శనివారం అడ్డగించారు. తమకు అన్యాయం చేసి ప్రాజెక్టు పనులు చేపడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శనివారం మంచి రోజు అని భావించి అక్కడ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు మేఘా కంపెనీ భూమి పూజకు ఉపక్రమించింది. ఈ విషయం తెలిసి ప్రాజెక్టు ప్రభావిత మూడు గ్రామాల ప్రజలు అక్కడకు చేరుకున్నారు. పనులను అడ్డగించి ఆందోళన చేపట్టారు. దీంతో ఆ కంపెనీ పనులను నిలిపివేసింది. ఆందోళన కార్యక్రమంలో పీసా కమిటీ అధ్యక్షుడు మనోజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఎపి జెన్కో యాజమాన్యం నిర్వాసితులకు న్యాయం చేసిన తరువాతే పనులు ప్రారంభించాలన్నారు. దుప్పిలివాడ, సీలేరు పంచాయతీ పరిధిలోని శాండికోరి, బూసికొండ, పార్వతీనగర్ గ్రామ నిర్వాసితులకు అన్యాయం చేయరాదన్నారు. నిర్వాసితులకు అభిప్రాయానికి విరుద్ధంగా పనులు చేపడితే సహించేది లేదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాత ప్రాజెక్టు పనులు చేపడతామని చెప్పి ఇప్పుడు మాటతప్పారన్నారు. ఇదే వైఖరి కొనసాగితే సహించేది లేదని హెచ్చరించారు. ఆందోళన నేపథ్యంలో మేఘా కంపెనీ ప్రతినిధులు పార్వతీనగర్‌లో నిర్వాసితులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో దండకారణ్య సమితి నాయకులు మార్కు రాజు, తదితరులు పాల్గొన్నారు.



పనులను అడ్డగించి నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి ఐ.పద్మ

ప్రజాశక్తి-ఎటపాక: ఈ నెల 13,14,15 తేదీల్లో అనంతపురంలో జరిగే ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రంపచోడవరం జిల్లా కార్యదర్శి ఐ.పద్మ పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు ఎన్.చిట్టెమ్మ గుండాలకాలనీలో ఐద్వా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ మహిళలపై జరిగే హింస అరికట్టాలని ప్రభుత్వాలను కోరారు. వరకట్నం నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టం, నిర్భయ వంటి అనేక చట్టాలు సాధించేందుకు పలు ఉద్యమాలను ఐద్వా చేపట్టిందని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కోసం అలుపెరగని పోరాటం చేశామన్నారు. చిన్నారులు, మహిళలపై ఇటీవల అత్యాచారాలు, హత్యలు విపరీతంగా పెరిగిపోయాయని వీటిపై 2023 లోనే రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై హింస అరికట్టాలని పోరియాత్ర కార్యక్రమంతో అన్ని జిల్లాల్లో పర్యటించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తోట రమణ, గంటా కొండమ్మ, చిట్టెమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గుండాలకాలనీలో ఐద్వా జెండా ఆవిష్కరణ చేస్తున్న ఎన్.చిట్టెమ్మ

పారిశుధ్య కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మారేడుమిల్లి పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వకుండా అతి తక్కువ వేతనాలతో, తక్కువమంది కార్మికులను పెట్టుకుని ఎక్కువ శ్రమదోపిడీ చేస్తున్నారని, తక్షణమే పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, బూట్లు, యూనిఫామ్ తదితర రక్షణ పరికరాలు పంపిణీ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం మారేడుమిల్లిలో పారిశుధ్య కార్మికులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రంపచోడవరం డివిజన్‌లో పర్యాటక కేంద్రమైన మారేడుమిల్లికి పర్యాటకుల తాకిడితో ఎక్కువ పని ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీకి నిధులు వస్తున్నప్పటికీ ఆ స్థాయిలో వర్కర్లని నియమించడం కానీ, కనీసం 12000 వేతనం ఇచ్చే దానిలో కానీ గ్రామపంచాయతీ అధికారులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రక్షణ పరికరాలు లేకపోవడంతో చెత్తసేకరణలో భాగంగా కార్మికులు అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే పంచాయతీ కార్మికులకు రక్షణ పరికరాలు ఇచ్చి, కార్మికుల సంఖ్య పెంచి, వేతనాలు రూ.12 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన బాట పడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బెనర్జీ, పండు దొర, గిరిబాబు, కోటమ్మ, బంగారు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లపు వెంకట్



వినతిపత్రం ఇస్తున్న కుంజా శ్రీను

గిరిజనేతరుల అక్రమ కట్టడాలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలోని గిరిజనేతరుల అక్రమ కట్టడాలు గుర్తించి వాటిని తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను కోరారు. మండలలోని రేఖపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరస్వతిని కలిసి 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలనీ, నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాలు తక్షణమే తొలగించాలని ఇప్పటివరకూ మండల పరిధిలో ఎన్ని అక్రమ కట్టడాలు గుర్తించి ఉన్నారు ఎన్నింటికి తొలగించారు వాటికి సంబంధించిన వివరాలు సమాచార హక్కు చట్టం ప్రకారం తెలియజేయాలని శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే అధికారులు కరువయ్యారని మండి పడ్డారు. తక్షణమే నాన్ ట్రైబల్ అక్రమ కట్టడాలన్నీ తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమపరిషత్ చింతూరు డివిజన్ అధ్యక్షులు కూర చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించకపోతే ఆందోళన

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పంచాయతీలో ఉపాధి హామీ వేతనదారులకు వేతనాలు చెల్లించకపోతే వేతనదారులతో మండల కేంద్రంలో ఆందోళన చేపడతామని ఆదివాసీ నేత తెడ్ల రాంబాబు అన్నారు. శనివారం జడ్డంగిలో వేతనదారులతో రాంబాబు మాట్లాడారు. మండలబాడీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ పథకాలలో అవినీతి జరుగుతోందని చెప్పినా ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని అన్నారు. సుమారుగా 6 వారాలు వేతనాలు చెల్లించాల్సి ఉందని వేతన దారులు తమ దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ వేతనాలు చెల్లించకపోతే నిరసన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్డంగి చైతన్యనగర్ గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెడ్ల రాంబాబు

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి -సీలేరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో వీలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్ 176(సిఐటియు) బ్రాంచ్ అధ్యక్షులు బి. లక్ష్మణరావు టి.విష్ణుకుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగ కార్మిక సమస్యలపై ఎపి పవర్ జెఎసి అక్టోబర్ 15న నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. దానికి మద్దతుగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నిలవాలని కోరింది. వీటితోపాటు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ బి1829 సిఐటియు ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 129 ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ (రిజిస్టర్ నెంబర్ ఎఫ్ 2306) ఎనర్జీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజిస్టర్ నెంబర్ 381/22) యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఏఎల్ఎం గ్రేడ్ 2 యూనియన్ సమ్మెలో పాల్గొన్నట్లు వెల్లడించారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికులందరికీ ఒకే క్యాడర్ ఒకే వేతనం ఇవ్వాలని, 2022 పిఆర్సి ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్సి కమిటీని తక్షణమే వేయాలన్నారు. అన్ని యూనియన్లు కలిపి ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ ట్రబుల్ కమిటీగా ఏర్పడి డిమాండ్ సాధనకు అక్టోబర్ 15 నిరవధిక సమ్మెను విజయ వంతం చేయాలని కోరారు.

రామాలయానికి వితరణ

ప్రజాశక్తి -విఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో రామాలయానికి దివంగత వాళ్ల పూజారి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం శనివారం ఆయన భార్య వాళ్ళ పూజారిసీతమ్మ కాంగో, డోలక్ కానుకగా అందించారు. రామాలయ భజన బృందానికి వీటిని అందించారు.

గంజాయి సాగుపై గట్టి నిఘా

జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ సర్కిల్ పోలీస్ స్టేషన్ ను శనివారం అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీ ల్లో భాగంగా రికార్డులను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పాత కేసుల వివరాలతో పాటు గంజాయి నిర్మూలనకు చేపడుతున్న చర్యలపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అరకు సర్కిల్ పరిధిలో నమోదవుతున్న నేరాల సంఖ్య పై ఆరా తీశారు. అదేవిధంగా అరకు సర్కిల్ పరిధిలో సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి, అరకు సబ్ ఇన్స్పెక్టర్ గోపాలరావు, డుంబ్రిగుడ సబ్ ఇన్స్పెక్టర్ పాపి నాయుడు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అరకు పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నిర్మాణమవుతున్న నూతన భవన నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అమిత్ బర్ధర్ మాట్లాడుతూ, అరకు సర్కిల్ స్టేషన్ పరిధిలో ఉన్న పాత కేసులను పరిశీలించి దర్యాప్తును ముమ్మరం చేసి పరిష్కరించాలని, గంజాయి రవాణా, సాగు పై గట్టి నిఘా పెట్టాలని, వచ్చే పర్యాటక సీజన్ ను దృష్టిలో పెట్టుకుని పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. పర్యాటక ముసుగులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి షహబద్ అహ్మద్, సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి, ఎస్ఐలు గోపాల్ రావు, పాపినాయుడు పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్ పర్యటనకు అనుమతి లేదు

ప్రజాశక్తి -నక్కపల్లి : బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ రాజయ్యపేట వచ్చేందుకు అనుమతి లేదని ఎస్ఐ సన్నిబాబు స్పష్టం చేశారు. బల్క్ డ్రగ్‌ను ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలకు సంఘీభావం తెలిపేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో రామచంద్ర యాదవ్ ఆదివారం రాజయ్యపేట వస్తున్నట్లు ఆయన వర్గీయులు తెలియజేయడంతో, ఎస్ఐ సన్ని బాబు మత్స్యకారుల ఆందోళన శిబిరం వద్దకు వచ్చి జిల్లా ఎస్పీ పంపించిన ఉత్వరుల నోట్ ను మత్స్యకార నాయకులకు అందజేసారు. రామచంద్ర యాదవ్ గ్రామానికి వస్తే సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున, ఆయన అభ్యర్ధనను తిరస్కరించడం జరిగిందన్నారు. ఈనెల 5న రాజయ్యపేట పర్యటనకు వస్తున్న రామచంద్రయాదవ్ ను రాజమండ్రిలో పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే.

ఈ -పంట నమోదుతో లాభాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈనెల 25 నాటికి రైతుల ందరూ ఈ -పంటను నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలో కాగిత గ్రామంలో శనివారం సిబ్బందితో కలిసి రైతులకు ఈ -పంటను నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీ, కాలానుగుణ పంట నష్ట పరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే ఈ పంట నమోదు తప్పనిసరి అని అన్నారు. మండలంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు 21378 ఎకరాలకు గాను 15965 ఎకరాలు (73 శాతం) నమోదు చేయడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో గడువు లోపు రైతులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఈ పంట నమోదు చేయాలని, ఈ పంటతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఆర్.ఎస్.కె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమములో ఏఈఓలు శ్రీనివాస్, సాయి కుమారి, వ్యవసాయ సహాయకులు ధనరాజ్, ఆర్ ఎస్ కె సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త రోడ్లతో అవస్థలు



కోతకు గురైన పట్కదౌడ మట్టి రోడ్డు

ప్రజాశక్తి -అనంతగిరి: ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు., కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో ఏడాదిలోపే శిథిలావస్థకు చేరుకున్న దుస్థితి నెలకొంది. అల్లూరి జిల్లా హుకుంపేట మండలం భూర్జ పంచాయతీ పట్కదౌవడ గ్రామం నుండి బూర్జ గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి సుమారు నాలుగు కోట్లు పైగా నిధులు మంజూరు అయ్యాయి. కాగా సుమారు రూ కోటి. 20 లక్షలు పట్కదౌడ గ్రామం నుండి ఒక్క కిలోమీటర్ల దూరం ముందుకు చేపట్టిన మట్టి గ్రావెల్ రోడ్డు వర్షాలకు కోతకు గురైంది. ఆ రోడ్డుమీదుగా బైక్, ఇతర వాహనాలు వెళ్లలేదు. మట్టి రోడ్డు నిర్మాణం అనంతరం క్వాలిటీతో కూడిన గ్రావెల్ వేసి రోలింగ్ చేయవలసి ఉన్నప్పటికీ ఆ పనులు చేయక పోవడంతోనే చిన్నపాటి వర్షాలకు కోతకు గురై రోడ్డంతా పాడైంది బూర్జ గ్రామంలో నుండి పట్కదౌవడ గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్ల పైగా చేపట్టిన రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనంతగిరి మండలం రాజుపాక గ్రామంలో నుండి డెక్కపురం మీదుగా పట్కదౌడ వరకు సుమారు రూ 2 కోట్ల 30 లక్షల పైగా నిధులతో మట్టి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు ఈ రోడ్డు మీదుగానే డెక్కపురం. పట్కదౌడ పివిటిజి ప్రజలు రాకపోకలు సాగిస్తారు. మంజూరైన పీఎం జన్మన్ పథక గృహాల నిర్మాణపు సామగ్రి రవాణా సాగించడం కష్టమవుతోంది. నిధులు స్వాహకు పాల్పడిన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జి. అప్పారావు. రమేష్. దాసు. లింగు తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా..తప్పని ప్రయాణం



చిమ్మ చీకట్లో వాగు దాటుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ఎడతెరిపి లేకుండా గత నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గెడ్డలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాణానికి ముప్పు అని తెలిసినా పొంగి ప్రవహిస్తున్న గెడ్డల్లో నీటిని సైతం లెక్క చేయకుండా అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని దాటుతున్న దుస్థితి చోటుచేసుకుంటున్నాయి. దిగువ ప్రాంతంలో ఉన్న రైవాడ డ్యాంకు ప్రవేహించే లుంగపర్తి పంచాయతీ పరిధి వెలగలపాడు, మెట్టవలస వద్ద ఉన్న గెడ్డ పొంగి పొర్లింది. దీంతో లుంగపర్తి పంచాయతీ ఓనుకొండ, నేలపాలెం, ఎర్రమెట్టు, మల్లుంగుమ్మి, మల్లెపాడు. గ్రామాలకు చెందిన గిరిజనులు గెడ్డ వద్ద చిక్కి పోతున్నారు. మరి కొంతమంది సాహసం చేసుకుని ఒకరి ఒకరు చేతులు పట్టు వాగు దాటుతున్నారు. కాశిపట్నం, డమ్ముకు వారపు సంతకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళలో సెల్ ఫోన్ల టార్చ్ లైట్ లు వెలిగించుకొని ఒక్కరి ఒకరి సహాయంతో వాగు దాటుతున్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపరచాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన విద్యార్థుల్లో విద్యా సామార్థ్యాలు మెరుగుపడేలా బోధన సాగించాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్ సుందర్రావు కోరారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో తరల్ శిక్షణ ముగింపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి ప్రతిఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. సమయపాలన పాటించి బాలల్లో నూతనోత్తేజం కలిగించేలా విద్యా సామార్థ్యాలు పెంచాలని ఆయన సూచించారు. రెండు దశల్లో 382మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఇఒ

విఓఎల హర్షం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలోని శనివారం విఓఏల ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు సీదరి మత్యలింగం, గౌరవ అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్టీ సేల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు, సీనియర్ నాయకులు పిన్నలరావు, కొండలరావు, సంఘం మండల నాయకులు దేవినాయుడు, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి సింహచలం, ధర్మ, కాశీ, సుధ, పుష్ప, పద్మ, బాలన్న పాల్గొన్నారు.

బిసి బాలికల వసతి గృహంలో

విద్యార్థినుల రక్షణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- రావికమతం: రావికమతం మండల కేంద్రంలో బీ.సీ బాలికల వసతి గృహంలో 12 మంది బాలికలపై పిచ్చి కుక్క దాడి సంఘటనపై జాయింట్ కలెక్టర్ సమగ్ర మైన విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 9 తెల్లవారు జామున బిసి బాలికల వసతి గృహంలో పిచ్చికుక్క చొరబడి12 మంది పిల్లల పై దాడి చేసిన విషయం తెలిసిందే రన్నారు. బాలికల వసతి గృహంలో నూతన మరుగుదొడ్ల నిర్మాణం జరుగుతున్న కారణంగా లోపలకి ట్రాక్టర్లు మెటీరియల్ నిమిత్తం వెళ్లడానికి ప్రహరీ గోడను కొంతమేర కట్ చేసి గ్రీన్ మ్యాట్ వేశారన్నారు. దీంతో బాలికలకు రక్షణ సక్రమంగా లేనందున పిచ్చి కుక్కలు పిల్లల పై దాడి చేయడం జరిగిందన్నారు. తొలగించిన ప్రహరీని తొందరగా నిర్మాణం చేపట్టి బాలికలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి యస్.వలసయ్య, పాంగి చంద్రయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: జిల్లాలోని ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు తగు న్యాయం సహాయం చేయాలని ఆలోచన ఉండి స్వచ్ఛందంగా పనిచేసే పారా లీగల్ వాలంటీర్లు (న్యాయ సహాయ కులు)గా పనిచేయడానికి ఆసక్తి కలిగి ఉన్న యువతి యువకులు ఈనెల 14 లోపు మండల న్యాయ 3 సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి కనీస విద్యార్హతగా అని, వివిధ సేవా సంస్థలలో పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికయిన అభ్యర్థులకు ఎటువంటి జీతం, పారితోషం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వైఎస్ఆర్ క్యాంప్ కార్యాలయంలో వైయస్సార్ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలో నిర్మాణాలు చేపడుతున్న 10 మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో నిర్మించేందుకు సిద్ధమైన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ కోటి సంతకాల ఉద్యమం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. నవంబర్ 22 వరకు రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేసి పార్టీ కేంద్ర కార్యాలయం ద్వారా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే ర్యాలీలు, నిరసనలు చేయనున్నామన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం మున్సి పాలిటీ బలిఘట్టం వై.జంక్షన్ నుంచి జోగినాధుని పాలెం వెళ్లే రోడ్డు మరమ్మతు చేపట్టాల నిజనసేన పార్టీ సీనియర్ నాయకులు అప్పన దొరబాబు కోరారు. దొరబాబు పార్టీ నాయకులతో కలిసి ఈ గొయ్యిను పరిశీలించారు. జనసేన నాయకులు ఫిర్యాదు మేరకు ఆర్అండ్‌బీ ఏఇ నాయుడు అక్కడికి చేరుకున్నారు. ఈ రోడ్డుకు నిధులు కేటాయించారని, త్వరలోనే పనులు చేపడతామని ఏఈ జనసేన నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని నాయకులు ఏఈని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దేపల్లి గణేష్, మారిశెట్టి రాజా తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, తదితరులు

సిఐటియు అఖిల భారత మహాసభ లోగో, పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకూ జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభల లోగోను, పోస్టర్‌ను శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 70 లక్షల మంది కార్మికుల సభ్యత్వానికి ప్రాతినిథ్యం వహిస్తూ 1500 మంది ప్రతినిధులు 29 రాష్ట్రాల నుండి ఈ మహాసభలకు హాజరవుతున్నారన్నారు ఈ మహాసభల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చలు జరిపి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. ఫలితంగా కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసుకునే హక్కు, జీతభత్యాలు బేరం ఆడుకునే హక్కు వంటి ప్రాథమికమైనవి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చట్టం చేసిందన్నారు. దీనిని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. ఈ కార్మిక, ప్రజా వ్యతిరేక చర్యలన్నింటిపైనా ఉద్యమిస్తామన్నారు. సిఐటియు ఏర్పడ్డ 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి అఖిలభారత మహాసభలు విశాఖ నగరంలో జరుగుతున్నాయని, దీనికి ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మహాసభల చివర రోజైన జనవరి 4న లక్ష మందితో భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. మహాసభల సందర్భంగా రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు, ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహాసభల జయప్రదానికి విశాఖ నగరంలో ఉన్నటువంటి కార్మికులు, ప్రజలు, శ్రేయోభిలాషులు, మేధావులు, అభ్యుదయవాదులు ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు పి.మణి, బి.జగన్, ఉపాధ్యక్షులు

విశాఖకు విస్తరించిన వాల్యూ గోల్డ్ సేవలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: తెలంగాణలో బంగారం వ్యాపారంలో సేవలందిస్తున్న వాల్యూగోల్డ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని, విశాఖ నగరంలో నాలుగు నూతన బ్రాంచ్‌లు ప్రారంబిస్తోందని ప్రముఖ సినీ నటి అనసూయ అన్నారు. ఈ సందర్భంగా బీచ్‌రోడ్‌లోని పార్క్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గడిచిన ఆరు నెలల్లోనే తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 15 నూతన బ్రాంచ్‌లు ప్రారంభించారని ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 19 బ్యాంకులు కలిగి ఉన్నారని తెలిపారు. రాబోయే రెండు సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలో మరో 40 నుండి 50 బ్రాంచ్‌లు ప్రారంభించి దక్షిణ భారతదేశమంతటా వారి సేవలు విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని ఆమె తెలిపారు. ఇటీవల విశాఖలోని జగదాంబ, గాజువాక, గోపాలపట్నం, మధురవాడ ప్రాంతాల్లో నూతన బ్రాంచ్‌లు ప్రారంభించారని ఈ సంస్థ ప్రధానంగా బంగారానికి తక్షణం నగదు, తాకట్టు బంగారం విడుదల, సాంకేతిక ఆధారిత మూల్యాంకనంతో వినియోగదారులకు సేవలు అందిస్తుందన్నారు వ్యాల్యూ గోల్డ్ డైరెక్టర్ అఖిల్ చందా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో విస్తరించడం ద్వారా తమ బంగారు వ్యాపారాన్ని వద్ధి చేయాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని ఈ కార్యక్రమానికి వాల్యూ గోల్డ్ సిఇఒ భరద్వాజ్ పంపట్వార్, సౌమ్య చందా, ఆషికా చందా తదితరులు పాల్గొన్నారు.

తాగునీరూ కరువాయె..!

- బోరు ఉన్నా మోటార్ లేదు..
- ఊటనీరే తాగుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -సీలేరు: అధికారుల నిర్లక్ష్యం వలన మారుమూల గిరిజన గ్రామాల్లో మంచినీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డకాలనీలో తాగునీటి సౌకర్యం లేక ఎన్నో ఏళ్లగా కాలువలనుంచి ప్రవహించే ఊటనీరు సేకరించి గిరిజనులు తాగునీటికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించమని పలుమార్లు అధికారుల దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి బోరుబావి మంజూరు చేశారు. బోరు తవ్వి 4 నెలల గడుస్తున్నా మోటారు బిగించలేదు. దీంతో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిఅన్న చందంగా బోరు ఉన్నా మోటారు లేక ఇబ్బంది పడుతున్నారు. సమీపంలో ఉన్న ఊటనీరు సేకరించుకుని తాగుతున్నారు. కలుషిత నీటిని తాగడం వలన రోగాల బారినపడుతున్నారు. మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఉపసర్పంచ్ మంగరాజు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీవాసులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



ఊటనీరు తీసుకెళ్తున్న గ్రామస్తులు

అదాని సిమెంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయండి

వామపక్ష పార్టీలు డిమాండ్

ప్రజాశక్తి - గాజువాక

కాలుష్య కారక అదానికి చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోతన సన్యాసిరావు భవన్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఈ నెల 8న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలందరూ ఫ్యాక్టరీ వద్దని ముక్తకంఠంతో తేల్చిచెప్పినా, మరలా 15 రోజుల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇది దుర్మార్గమన్నారు. ఇప్పటికే గాజువాక ప్రజానీకం అదాని గంగవరం పోర్టు కాలుష్యంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. అదాని సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణమైతే 10 లక్షల మంది ఇబ్బందులపాలవుతారన్నారు. దీని ప్రభావం ఎన్‌ఎడి కొత్త రోడ్డు వరకు ఉంటుందని తెలిపారు. పబ్లిక్ హియరింగ్ జరపబోమని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించాలన్నారు. ప్రజల ప్రాణాలు ముఖ్యమని ఆయన గుర్తెరగాలన్నారు. ఫ్యాక్టరీ పెట్టడానికి రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ జనావాసాల్లో అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఉక్కు భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారని తెలిపారు. సిపిఐ ఎంఎల్ ఏరియా కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగాలు, ఫ్యాక్టరీ పేరిట ప్రజలను మోసం చేయొద్దన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు నాయకులు దేవా మాట్లాడుతూ జనావాసాల మధ్య ఫ్యాక్టరీ పెడితే ప్రజల ఆరోగ్యాలకు తీవ్ర నష్టం కలుగుతుందని, భూగర్భ జలాలు కలుషితమవుతాయని అన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు కెఎం.శ్రీనివాసరావు, నమ్మి రమణ, రామారావు, పి.పైడిరాజు, లోకేష్, సిపిఐ నాయకులు కె.సత్యనారాయణ, డి.ఆదినారాయణ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న వామపక్షపార్టీల నాయకులు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖ క్రీడాకారులు ప్రతిభ చాటాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఈనెల 26న పోలీస్ బేరక్స్ గ్రౌండ్స్‌లో వెటరన్ అథ్లెటిక్స్ అసోసిషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం డిస్ట్రిక్ట్ వెటరన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ - 2025 పోటీలను వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం (వావా) నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శివాజిపాలెంలోని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కార్యాలయంలో శనివారం వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్‌చైర్మన్ డాక్టర్ కమల్‌బయిద్, వావ్ అధ్యక్షులు డాక్టర్ మంగవరప్రసాద్, పీఆర్‌ఓ చింతలపాటి వంశీ కృష్ణ వర్మ ,కోశాధికారి ఎం. రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులే కాకుండా 30 సంవత్సరాల వయసు దాటిన ఔత్సాహిక క్రీడాకారులెవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చాన్నారు. ట్రస్ట్‌చైర్మన్, వావ్‌చీఫ్‌పేటర్న్ డాక్టర్ కమల్ బయిద్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన క్రీడాకారులను ఆదుకోవడానికి ప్రత్యేక క్రీడానిధిని ఏర్పాటు చేస్తూ లివెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ స్థాపించామన్నారు. వావ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మంగ వరప్రసాద్ మాట్లాడుతూ 5 కి.మీ వాకింగ్, 100, 200, 400, 800, 1500, 5000 మీటర్ల పరుగు పందెం, ట్రిపుల్‌జంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, జావెలిన్ త్రో, హేమర్‌త్రో తదితర పోటీలను నిర్వహిస్తామన్నారు. 30-34 వయసు నుండి ఆ పైబడి వయస్సు గల స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడాకారులను డిసెంబర్ 13,14న గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9701347311, 8309157522 నెంబర్సను సంప్రదించాలన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన అవసరం

విశాఖ కలెక్టర్ భార్య, ప్రముఖ అడ్వకేట్ దివ్య ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: రొమ్ము క్యాన్సర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని విశాఖ కలెక్టర్ భార్య, ప్రముఖ అడ్వకేట్ దివ్యప్రసాద్ అన్నారు. పింక్‌మంత్ పేరిట శనివారం కెజిహెచ్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఖచ్చితంగా ఏడాదికి ఒకసారి విధిగా అన్ని రకాల వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, రొమ్ముక్యాన్సర్‌పై మహిళలకు విస్తృత అవగాహన కార్యక్రమంతో పాటు అన్నిరకాల వైద్యపరీక్షలు ఉచితంగా చేపట్టినట్లు తెలిపారు. రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.బుజ్జిబాబు కెజిహెచ్‌లో ఉన్న ఉచిత సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంకాలజీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ కె.శిల్ప, సూపరింటెండెంట్ డాక్టర్ వాణిలను దివ్యప్రసాద్ సత్కరించారు. అనంతరం సిఎస్ఆర్ బ్లాక్‌బయట పింక్ బెలూన్లు ఎగరవేశారు.

దుకాణం తొలగింపు

ప్రజాశక్తి -విఆర్‌పురం : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు చాలా ఉన్నాయని వాటిని పట్టించుకోని అధికారులు కాలనీలో ఒక మూలన ఉన్న దుకాణాన్ని కూల్చివేయడం అన్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బి.సి కాలనీలో ఉంటున్న చిరు వ్యాపారి దుకాణాన్ని డ్రైనేజీకి అడ్డంగా ఉందని తాము ఊర్లో లేని సమయంలో కూల్చివేశారని ఉంగుటూరు అలివేలు భర్త ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పంచాయితీ సెక్రటరీ, విఆర్ఒ వివరణ కోరగా తమపై అధికారుల ఆదేశాల మేరకే దుకాణాన్ని తొలగించామని వారు తెలిపారు.